సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఘనంగా ధమ్మచక్ర మహోత్సవం



అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేస్తున్న బెహరా భాస్కరరావు తదితరులు

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు లక్ష్మీనగర్‌లో జై భీమ్ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం 67వ ధమ్మచక్ర మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ నేటి తరానికి ఆదర్శ ప్రాయుడని కొనియాడారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అప్పలస్వామి నాయుడు, గుణిశెట్టి శ్రీనివాసరావు, నాయకులు బవడి దుర్గేష్, టి. రమేష్, ఉమా మహేశ్వరరావు, హరి, వెంకట్, ఆర్. శ్రీను సత్యకళ, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ రమణ

విశాఖ విద్య: అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ సూచించారు. వార్డు పరిధిలోని కాకాని నగర్‌లో జీవీఎంసీ నిధులతో చేస్తున్న అభివృద్ధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. కాకాని నగర్‌లో రూ.10 లక్షలతో సీసీ డ్రైనేజీలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. పనులు సకాలంలో పూర్తయ్యేలా శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్ రావు, కార్యదర్శి సిద్ధా రాజ భాస్కర్, రామకృష్ణ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎస్ఐ రాత పరీక్షలు



పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థులకు సూచనలు చేస్తున్న సీఐ జి.డి.బాబు

మల్కాపురం: ఏపీ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో ఎస్ఐ రాతపరీక్షలు పలు కేంద్రాల్లో శనివారం ప్రశాంతంగా జరిగాయి. జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం సెయింట్ జోసెఫ్ పాఠశాల, సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలోని పరీక్ష కేంద్రాలను మల్కాపురం సీఐ జి.డి.బాబు పరిశీలించారు. అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. అభ్యర్థులకు పరీక్ష కేంద్రాల వద్ద అవసరమైన వసతులు కల్పించినట్లు చెప్పారు. ఎటువంటి సమస్య ఉన్నా తనకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగరాజు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలపై సీపీఐ నాయకుల నిరసన

మల్కాపురం: పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ 59వ వార్డు లేబర్ జంక్షన్ వద్ద సీపీఐ నేతలు శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.సత్యాంజనేయ మాట్లాడుతూ పెరిగిన విద్యుత్ చార్జీల వలన సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిత్యావసర సరకుల ధరలు పెరిగి అల్లాడుతున్న ప్రజలకు విద్యుత్ చార్జీలు మరింత భారం అయ్యాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గుడాల రాంబాబు, గండి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ వెస్ట్
8978872250

రైతు బజారులో సమస్యలు!



తుప్పపట్టిపోతున్న చెత్తను కత్తరించే యంత్రం



గోపాలపట్నం రైతు బజారు ముఖ ద్వారం

- వెలగని విద్యుత్ దీపాలు
- పని చేయని సీసీ కెమెరాలు

గోపాలపట్నం: గోపాలపట్నం రైతు బజారు సమస్యల వలయంలో కొట్టు మిట్టాడుతోంది. అత్యంత విశాలమైన ప్రాంగణంలో ఉన్న ఈ బజారులో నిర్వహణ లోపాలు స్పష్టమవుతున్నాయి.మోడల్ రైతు బజారుగా తీర్చి దిద్దుతామని హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదు. అత్యధికంగా వినియోగదారులు వచ్చే బజారులో కనీస సౌకర్యాలు లేకపోవడంతో రైతులు, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని స్టాళ్లలో విద్యుత్ దీపాలు వెలగడం లేదు. చోరట్నుడి కట్టడి చేయడంతో పాటు రైతు బజారులో సెక్యూరిటీ కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు చాలా వరకు అలంకార ప్రాయంగా ఉన్నాయి. మొత్తం 6 సీసీ కెమెరాలు ఉండగా రెండో మూడో పని చేస్తున్నాయి.

డిజిటల్ బోర్డు ద్వారా వినియోగదారులకు కాయగూరల సమాచారం ఇచ్చే డిజిటల్ బోర్డు పని చేయడం లేదు. మైక్ ద్వారా ఈ సమాచారం అందిస్తున్నారు.

మూలకు చేరిన మినరల్ వాటర్

రైతులు, వినియోగదారులకు మినరల్ వాటర్ అందించే సుజల మినరల్ వాటర్ ప్లాంట్ కొన్నాళ్లుగా మూలకు చేరింది. దీన్ని బాగు చేసేందుకు తీసుకెళ్లిన మోటారు గతి ఏంటో తెలియని పరిస్థి ఏర్పడిందని వాపోతున్నారు.



పని చేయని సీసీ కెమెరాలు

తలుపుల్లేని బాత్‌రూములు

రైతు బజారులో బాత్‌రూములకు తలుపులు లేవు. తప్పని సరి పరిస్థితిలో వాడాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. అరకు వంటి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రైతులు రాత్రి నిద్ర ఇక్కడే చేస్తారు. అలాంటి వారికి కనీస సౌకర్యాలు లేకపోతే ఎలా అని వాపోతున్నారు. పార్కింగ్ సమస్య కూడా ఉంది.

కంపుకొడుతున్న వర్మీ కంపోస్టు

రైతు బజారులో వర్మీ కంపోస్టు తయారు చేసే విధానాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. ఆదిలో మంచి ఫలితాలు వచ్చినా రానురానూ మరుగున పడిపోయింది. దీని నిర్వహణ చూసే వారు కరువయ్యారు. ఇక్కడ చెత్త మాత్రం పోగవుతోందే తప్పా మరో ప్రయోజనం లేకపోతోంది. వ్యర్థాలను కత్తరించే యంత్రం కూడా మరుగన పడిపోయింది. దీన్ని ఇపుడు ఉపయోగించే పరిస్థితిలో లేదని ఇక్కడి వారు చెబుతున్నారు.



పని చేయని మినరల్ వాటర్ ప్లాంట్

నిరాదరణకు గురవుతున్న పార్క్

రైతు బజారుకు కుటుంబంతో వచ్చే వినియోగదారులకు ఆహ్లాదం పంచేందుకు ఇక్కడ ఓపెన్ పార్క్ ఏర్పాటు చేశారు. చిన్న పిల్లలు ఆడుకునేందుకు వీలుగా ఊయలలు, జారుడు బల్లలు ఏర్పాటు చేశారు. అయితే చుట్టు పక్కల ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉండడంతో ఎవరూ వీటిని వినియోగించలేక పోతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి రైతు బజారులో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

విద్యార్థుల జీవితాల్లో జ్ఞానజ్యోతి వెలిగించాలి



శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఆర్‌జేడీ జ్యోతి కుమారి



శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

- ఆర్‌జేడీ జ్యోతికుమారి

అక్కిరెడ్డిపాలెం: విద్యార్థుల జీవితాల్లో జ్ఞానజ్యోతి వెలిగించాలని విద్యాశాఖ ఆర్‌జేడీ ఎం.జ్యోతి కుమారి కోరారు. చిన్నారుల సమగ్ర వికాసానికి సమష్టిగా కృషి చేయాలన్నారు. ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖలో పని చేస్తున్న చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 120 రోజుల పాటు నిర్వహించిన జ్ఞాన జ్యోతి రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా షీలానగర్‌లోని మిలీనియం స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్జేడీ మాట్లాడారు. మూడు నుంచి ఎనిమిది సంవత్సరాల వయసు గల పిల్లలందరూ తప్పకుండా చదవడం, రాయడం తదితర చతుర్విధ ప్రక్రియలను చేయగలిగేలా చేయడం శిక్షణ ముఖ్య ఉద్దేశమని వివరించారు. శిక్షణలో పాల్గొన్న ప్రతీ ఒక్కరు మండల స్థాయిలో జరిగే శిక్షణ కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లకు, ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చి, క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చూడాలని కోరారు.

బాలల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలి

సమగ్ర శిక్ష అభియాన్ అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యంపై, విద్యపై పూర్వ ప్రాథమిక దశ నుంచి ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. అంగన్‌వాడీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ కనబరిచి, విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని ఆకాంక్షించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ రాష్ట్ర పరిశీలకుడు పైడి వెంకటరావు, భీమిలి డైట్ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్, అకాడమీ మానిటరింగ్ అధికారి డాక్టర్ జి.లక్ష్మి, కోనసీమ ఏఎంవో పి.రాంబాబు, కీ రిసోర్స్ పర్సన్లు ఆర్.ఎస్.ప్రసాద్, నిర్మలా కుమారి, హరిణి, తాతాజీ, రమాదేవి, సుచరిత, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంపత్ వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సంపత్ వేంకటేశ్వరుడు

కంచరపాలెం: స్థానిక గొల్లకంచరపాలెం కోదండ సీతారామ, ధనలక్ష్మి దేవి, సంపత్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు శ్యామ్ ఆచార్యులు ఆధ్వర్యంలో ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీదళార్చన, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం రద్దీగా ఉండడంతో ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేశారు. శ్రీరామా సేవా సమాజం (యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యానారాయణ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం భక్తి సంకీర్తనలు అలరించాయి. నక్షత్ర హారతి ఇచ్చారు.

పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం : చక్రదర్‌పూర్ డివిజన్, రూర్కెలా స్టేషన్ పరిధిలో జరుగుతున్న భద్రత పనుల నిమిత్తం సోమవారం(ఈ నెల 16వ తేదీ) జగదల్‌పూర్–రూర్కెలా(18108) ఎక్స్‌ప్రెస్, గుణుపూర్–రూర్కెలా(18118) రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు.

ప్రయోగాత్మక హాల్ట్ : ప్రయాణికుల సౌకర్యార్థం రూర్కెలా–జగదల్‌పూర్–రూర్కెలా(18107/18108) ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 16వ తేదీ నుంచి బ్రహ్మా స్టేషన్‌లో ప్రయోగాత్మక హాల్ట్ కల్పిస్తున్నట్టు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

నేడు బెంగళూరు–హతియా వన్ వే స్పెషల్

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఎస్ఎంవీ బెంగళూరు–హతియా(06503) వన్ వే స్పెషల్‌ను నడుపుతున్నారు. ఈ రైలు బెంగళూరులో ఆదివారం ఉదయం 8.50 గంటలకు బయల్దేరి అదే రోజు అర్ధరాత్రి 2.35 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడి నుంచి 2.40 గంటలకు బయల్దేరి సోమవారం సాయంత్రం 5.45 గంటలకు హతియా చేరుకుంటుంది.

ఘనంగా హిందీ పక్షోత్సవాలు



రాజభాషా పురస్కారాలను అందజేస్తున్న రియర్ అడ్మిరల్ మనీష్ శర్మ

సింధియా: తూర్పు నావికాదళ సాముద్రిక ఆడిటోరియంలో శనివారం హిందీ పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించారు. నావికా హెడ్ క్వార్టర్స్ చీఫ్ స్టాఫ్ ఆఫీసర్(ఆపరేషన్స్) రియర్ అడ్మిరల్ మనీష్‌శర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని వార్షిక హిందీ మ్యాగజైన్ పూర్వివాణి 29వ ఎడిషన్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందీ భాష, సంస్కృతిని ప్రోత్సహించడంలో పూర్వివాణి మ్యాగజైన్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అనంతరం హిందీలో అధికారిక కార్యక్రమాలను నిర్వహించడంలో విశేష కృషి చేసిన వివిధ యూనిట్లకు రాజభాషా పురస్కారాలు అందజేశారు.

ఆత్మనిర్భర్ భారత్ వైపు పురోగమించాలి

- డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ శ్రీనివాసరావు
- ఎన్ఎస్‌టీఎల్‌లో ముగిసిన శిక్షణ తరగతులు



కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ శ్రీనివాసరావు, ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్

గోపాలపట్నం: పరిశ్రమ 4.0 కాన్సెప్ట్‌ను అనుసరించి ఆత్మనిర్భర్ భారత్ వైపు పురోగమించాలని విశిష్ట శాస్త్రవేత్త డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్(నేవల్ సిస్టమ్స్ అండ్ మెటీరియల్స్) వై.శ్రీనివాసరావు అన్నారు. ఎన్ఎస్‌టీఎల్‌లో పరిశ్రమ 4.0 కాన్సెప్ట్ అప్లికేషన్స్‌పై ఐదు రోజులుగా జరుగుతున్న శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఆర్‌డీవో, దేశాభివృద్ధి కోసం ఉద్యోగులంతా ఆధునిక నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలన్నారు. ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ క్రమ పద్ధతిలో ప్రాజెక్టు పూర్తికి పరిశ్రమ 4.0 దోహదపడుతుందన్నారు. అత్యంత ప్రయోజనకరమైన ఈ కోర్సులో స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్, ఆడిటివ్ మాన్యుఫ్యాక్చరింగ్, రోబోటిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, అగ్‌మెంటెడ్ రియాలిటీ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త, ఎఫ్ కోర్సు డైరెక్టర్ ఎస్.మధుకిరణ్, శాస్త్రవేత్త, జీ టెక్నాలజీ డైరెక్టర్ కేదార్‌నాథ్, ఐఐటీ, పలు వర్సిటీలు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో జూదరులు

కూర్మన్నపాలెం: బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 27,280 రూపాయల నగదు, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని దువ్వాడ పోలీసులకు అప్పగించారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి.. రాజీవ్‌నగర్ సమీప యాతపాలెంలో జనసంచారం లేని బహిరంగ ప్రదేశంలో పేకాటడుతున్నారనే సమాచారం మేరకు ఏసీపీ త్రినాథ్ ఆదేశాలతో టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ రాధాకృష్ణ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వరంగ సంస్థల రక్షణకు ఉద్యమం

సింధియా: కార్మికులు తమ వేతన ఒప్పందాలు, హక్కుల సాధనతో పాటు ప్రభుత్వరంగ సంస్థల రక్షణకు ఉద్యమించాలని గోడౌన్స్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) గౌరవాధ్యక్షుడు ఎం.జగ్గునాయుడు పిలుపునిచ్చారు. నేవల్ డాక్‌యార్డ్ సమీపంలోని ధనరెడ్డి అండ్ కంపెనీ, గంగిరెడ్డి షిప్పింగ్ సంస్థలో పనిచేస్తున్న 624 మంది కార్మికుల వేతన ఒప్పందం శనివారం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు పూడి పైడిరాజు అధ్యక్షతన నిర్వహించిన విజయోత్సవ సభలో జగ్గునాయుడు మాట్లాడారు. సీఐటీయూ నాయకత్వంలో కార్మికులు ఐక్యంగా నిలిచి నూతన వేతన ఒప్పందం చేసుకున్నందుకు, ఒప్పందానికి సహకరించిన యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధానకార్యదర్శి దేవుడునాయుడు, ఆఫీస్ బేరర్లు సన్యాసిరావు, వెంకటరావు, పాత్రుడు, శ్రీనివాసరావు, నాయుడు, మేస్త్రీలు, కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

అమృతరావు పోరాటం అజరామరం



అమృతరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోసం తన ప్రాణాన్ని పణంగా పెట్టిన అమృతరావు పోరాటం అజరామరమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. టి.అమృతరావు ఉక్కు ఉద్యమం చేపట్టి 54 ఏళ్లు అయిన సందర్భంగా స్టీల్ వైఎస్సార్ టీయూసీ ఆధ్వర్యంలో శనివారం ఉక్కు హిల్‌టాప్ కూడలి వద్ద ఉన్న అమృతరావు విగ్రహానికి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ మహనీయుల త్యాగఫలంగా ఏర్పడిన స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం కానివ్వబోమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉక్కు కర్మాగారాన్ని నడపడానికి సిద్ధంగా ఉందన్నారు. కొంతమంది ఉద్యమం ముసుగులో వారి రాజకీయ ఉనికి కోసం ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం పరిరక్షణకు సమష్టిగా పోరాడాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు

కేంద్ర మంత్రికి ఎల్ అండ్ ఎం సిరీస్ కార్మికుల వినతి



సమస్యలను కేంద్ర మంత్రికి వివరిస్తున్న ఎల్ అండ్ ఎం సిరీస్ కార్మికులు

మల్కాపురం: కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రి నారాయణస్వామిని షిప్‌యార్డ్ ఎల్ అండ్ ఎం సిరీస్ కార్మికులు శనివారం కలిసి తమ సమస్యలపై వినతి పత్రం అందించారు. పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు నగరానికి వచ్చిన కేంద్ర మంత్రిని బీజేపీ ప్రధాన కార్యదర్శి పి.వి.ఎన్ మాధవ్, అనకాపల్లి ఇన్‌చార్జి కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో వీరు మంత్రిని కలిశారు. 15 ఏళ్లకు పైగా పని చేస్తున్నామని.. అయినా తమకు పర్మినెంట్ కాలేదని వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు కార్మికులు తెలిపారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో యూనియన్ ప్రతినిధులు అనపర్తి నూకరాజు, కె.గోవిందరాజు, ప్రతినిధులు కె.నాయుడుబాబు,ఎస్.రామ్‌కుమార్,పాషా,రాము తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల కరపత్రం ఆవిష్కరణ



ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సత్యనారాయణ

కంచరపాలెం: స్థానిక దుర్గానగర్ దుర్గాదేవి, ధనలక్ష్మిదేవి ఆలయాలలో దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయాల ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ, శ్యామాచార్యులు తెలిపారు. ఈ మేరకు ధనలక్ష్మి దేవి ఆలయంలో శ్రీరామ సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాల కరపత్రాన్ని శనివారం ఆయన ఆవిష్కరించారు. 15వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 24వ తేదీ వరకు జరిగే ఉత్సవాల్లో అమ్మవారిని ప్రత్యేక అవతారాల్లో అలంకరించనున్నట్లు తెలిపారు. లక్ష కుంకుమార్చన, చండీ హోమం, సహస్ర దీపారాధన, సరస్వతి పూజ నిర్వహిస్తామన్నారు. ఈ నెల 30న సోమవారం ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, పల్లా వెంకట్రావు, పల్లా పెంటరావు, నమ్మి భాస్కరరావు, కొయ్య జగదీష్, నమ్మి జ్యోతేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కార్మికుల దీక్షకు సంఘీభావం



మాట్లాడుతున్న భోగవల్లి

మల్కాపురం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని వ్యతిరేకిస్తూ ప్లాంట్ ఉద్యోగులు జీవీఎంసీ గాంధీ విగ్రహం ఎదుట చేపట్టిన దీక్షలకు శనివారం ఇంటక్ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది ప్రాణత్యాగ ఫలం స్టీల్‌ప్లాంట్ అన్నారు. అలాంటి ఉక్కు పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం బడా బాబుల చేతుల్లో పెట్టాలనే యోచన చేయడం దుర్మార్గమన్నారు. కార్మికుల కుటుంబాల కష్టాలను గుర్తించి ప్రైవేటీకరణ యోచనను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇంటక్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికుల వేతన ఒప్పందం

మల్కాపురం: కార్మికులు తమ వేతన ఒప్పందాలు, కార్మిక హక్కుల సాధనకు కృషి చేయడంతో పాటు ప్రభుత్వరంగ పరిశ్రమలు ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకోవాలని గొడౌన్స్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎం.జగ్గునాయుడు కోరారు. నేవల్ డాక్‌యార్డ్ సమీపంలోని ధనరెడ్డి గొడౌన్స్‌లో పని చేస్తున్న కార్మికుల వేతన ఒప్పందం శనివారం జరిగింది. గొడౌన్స్ యూనియన్ అధ్యక్షుడు పూడి పైడిరాజు అధ్యక్షతన గొడౌన్స్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో జగ్గునాయుడు మాట్లాడుతూ సీఐటీయూ నాయకత్వంలో కార్మికులు ఐక్యంగా నిలిచి నూతన వేతన ఒప్పందం చేసుకున్నందుకు, దీనికి సహకరించిన యాజమాన్యానికి ఆయన అభినందనలు తెలిపారు. కార్మిక చట్టాలను కేంద్రం కాలరాస్తోందని ఆవేదన చెందారు. కేంద్రం కార్మికుల పట్ల చూపుతున్న నిర్లక్ష్య ధోరణిపై అంతా ఐక్యతతో పోరాడి కేంద్రం మెడలు వంచాలన్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమల ప్రైవేటీకరణ జరిగితే కార్మికుల జీవనానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. కేంద్ర నిర్ణయాలు కార్మికులకు నష్టం చేకూర్చేలా ఉందరాదన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

క్యాన్సర్ రోగులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

- పాలియేటివ్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ విద్యా విశ్వనాథ్
- హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రిలో 'కరేజ్ టు కేర్' సదస్సు



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న డాక్టర్ విద్యా విశ్వనాథ్

అగనంపూడి: క్యాన్సర్ వ్యాధిగ్రస్తులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి పాలియేటివ్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ విద్యా విశ్వనాథ్ సూచించారు. రోగులకు సాంత్వన కలిగించేలా వైద్యులు, సిబ్బంది వ్యవహరించాలన్నారు. వారు బాధ నుంచి ఉపశమనం పొందేలా చూడాలన్నారు. స్థానిక హోమీబాబా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో శనివారం నిర్వహించిన కరేజ్ టు కేర్ సదస్సులో ఆమె మాట్లాడారు. రోగులు, సంరక్షకులను గౌరవించే తీరును వివరించారు. ఆస్పత్రి నిరంతర వైద్యవిద్యలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు ఉత్సాహంగా పాల్గొన్నారు. హెల్త్ కేర్ ప్రొవైడర్ల శిక్షణలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు డాక్టర్ విద్యా విశ్వనాథ్ తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి పేర్కొన్నారు. అడ్మిషన్స్‌కు సంబంధించి ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 16 నుంచి 22 లోగా ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రాడ్యుయేట్ లెవెల్‌లో బీఎస్సీ ఆనర్స్ మ్యాథమెటిక్స్, బీఎస్సీ ఆనర్స్ ఫిజిక్స్, బీఎస్సీ ఆనర్స్ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ ఆనర్స్ కెమిస్ట్రీ, బీఎస్సీ ఆనర్స్ బోటనీ, బీఎస్సీ ఆనర్స్ జువాలజీ, బీఎస్సీ ఆనర్స్ మైక్రోబయాలజీ, బీఏ ఆనర్స్ హిస్టరీ, బీఏ ఆనర్స్ ఎకనామిక్స్, బీఏ ఆనర్స్ పొలిటికల్ సైన్స్, బీ.కాం జనరల్, బీబీఏ లాజిస్టిక్స్, బీబీఏ హోటల్ మేనేజ్‌మెంట్, బీబీఏ హెల్త్‌కేర్, డిజిటల్ మార్కెటింగ్‌తో పాటు 12 పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు, ఎంఏ ఎకనామిక్స్, ఎంఏ తెలుగు, ఎంఏ ఇంగ్లిషు, ఎంఏ సోషల్ వర్క్, ఎం.కాం, ఎంఎస్సీ మ్యాథమెటిక్స్, మైక్రోబయాలజీ, బోటనీ, ఫిజిక్స్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ కోర్సులకు సంబంధించి ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7032270810, 9052297729, 9396235303 నంబర్లలో సంప్రదించాలన్నారు.

కృష్ణా కళాశాల అధ్యాపకుడు 'పోలా'కు ప్రధాని ప్రశంస

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంస్కృతం అధ్యాపకుడు డాక్టర్ పోలా ఉమామహేశ్వరరావు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నుంచి ప్రశంసలు పొందారు. పరీక్షా పే చర్చ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు తగు సూచనలు చేసినందుకు పోలాను ప్రధాని అభినందిస్తూ కళాశాలకు ప్రశంస పత్రాన్ని పంపించారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. 'మీ భాగస్వామ్యం మీ పిల్లల భవిష్యత్తు పట్ల మాత్రమే కాకుండా మన యువతరం ఎదుర్కొంటున్న అనేక సమస్యల పట్ల మీ చిత్తశుద్ధి ప్రతిబింబిస్తుంది'అని ప్రశంస పత్రంలో పేర్కొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ వెస్ట్
9912222753, 9705933394
Office mail : sakshiadvtvsp@gmail.com